సర్పంచ్ ఏకగ్రీవం అవాస్తవం

పర్వతగిరి, సెప్టెంబర్ 10: చెరువుకొమ్ముతండాలో స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వచ్చిన కథనాలపై ఎంపీడీవో మాలోత్ శంకర్‌నాయక్, తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీవో పాక శ్రీనివాస్ నేతృత్వంలో మంగళవారం జీపీ కార్యాలయంలో విచారణ చేశారు. సర్పంచ్ ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు వచ్చిన ఆరోపణల్లో నిజం లేదని గ్రామానికి చెందిన ధరావత్ బాలాజీ తెలిపారు. విరాళాల ద్వారా వచ్చిన డబ్బులతో ఆలయాలు నిర్మించి, మిగతా డబ్బులను ఇంటింటికీ పంచుతామని చర్చించినట్లు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. విచారణలో కార్యదర్శి రమాదేవి, మాజీ సర్పంచ్, స్థానికులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి

పుష్పగుచ్ఛం ఇస్తున్న పోలెపాక ప్రసాద్

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 10: ఇటీవల నూతనంగా ఎన్నికైన టీపీసీసీ అధ్యక్షుడు మహేశకుమార్‌గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పోలెపాక ప్రసాద్ మంగళవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ప్రసాద్ వెంట నాయకులు సోల విజయ్, ఎస్‌కే సర్వర్ భాషా ఉన్నారు.

ఆయిల్‌పాం పంటల పరిశీలన

పర్వతగిరి, సెప్టెంబర్ 10: కొంకపాకలో ఆయిల్‌పాం తోటలను రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మంగళవారం పరిశీలించారు. మోహన్‌రావుతోపాటు పలువురు రైతులకు చెందిన 15 ఎకరాల తోటలను పరిశీలించి బాగుందని కితాబిచ్చారు. జిల్లావ్యాప్తంగా ఆయిల్‌పాం సాగు చేసిన రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ప్రభుత్వ సహకారాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు కుమారస్వామి, గంధం సంపత్‌గౌడ్, ప్రమోద్, యాకూబ్‌పాషా పాల్గొన్నారు.

నర్సంపేట: పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు, వర్ధన్నపేటలో..

చాకలి ఐలమ్మకు నివాళి

- ఆమె ఆశయ సాధనకు కృషి చేయాలి
- ప్రజాప్రతినిధులు, నాయకుల పిలుపు
- జిల్లావ్యాప్తంగా ఐలమ్మ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు

నర్సంపేట/చెన్నారావుపేట/వర్ధన్నపేట/పోచమ్మమైదాన్/నెక్కొండ/కరీమాబాద్/గీసుగొండ/దుగ్గొండి/పర్వతగిరి/మట్టెవాడ, సెప్టెంబర్ 10: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ 39వ వర్ధంతిని మంగళవారం జిల్లావ్యాప్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రజాప్రతినిధులు, నాయకులు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా నర్సంపేట మున్సిపాలిటీ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనీకిషన్ పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్ ఆధ్వర్యంలో నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే, బీసీ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకుడు సోల్తి సారయ్యగౌడ్ నాయకులతో కలిసి నివాళులర్పించారు. చెన్నారావుపేటలో జాగృతి విద్యానికేతన్ పాఠశాలలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి ఎంసీపీఐ(యూ) మండల కార్యదర్శి జన్ను రమేశ్ పూలమాల వేసి నివాళులర్పించారు. నల్లబెల్లిలో రజక సంఘం మండలాధ్యక్షుడు ధర్మారపు సాంబయ్య ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి రజక సంఘం నాయకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వర్ధన్నపేట తోపాటు ఇల్లందలో బీఆర్‌ఎస్ నాయకులు, రజక సంఘం నేతలతో కలిసి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వరంగల్ పోచమ్మమైదాన్ సెంటర్‌లో బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నెక్కొండలోని హైస్కూల్ కూడలిలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతిలో నాయకులు పాల్గొని నివాళులర్పించారు. అలాగే, కరీమాబాద్ అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని పలు చోట్ల చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. గీసుగొండలో ఐలమ్మకు రజక సంఘం నాయకులు కుమారస్వామి, అభిషేక్ నివాళులర్పించారు. దుగ్గొండి మండలంలోని ముద్దునూరు, నాచినపల్లిలో ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. రజక సంఘం మండల అధ్యక్షుడు రమేశ్ పాల్గొని సంఘం నాయకులతో కలిసి నివాళులర్పించారు. పర్వతగిరి మండలంలోని చింతనెక్కొండలో గ్రామీణ హితకారిణి సేవా సంఘం అధ్యక్షుడు గటిక మల్లయ్య నివాళులర్పించారు. వరంగల్ 29వ డివిజన్‌లో ఐలమ్మ చిత్రపటానికి బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కొడకండ్ల సదాంత్ పూలమాల వేసి నివాళులర్పించారు.

నల్లబెల్లి: నివాళులర్పిస్తున్న నాయకులు, విద్యార్థులు

వరంగల్ మీదుగా 12 స్పెషల్ రైళ్లు

కాజీపేట, సెప్టెంబర్ 10: దసరా, దీపావళి నేపథ్యంలో కాజీపేట టౌన్, వరంగల్ రైల్వేస్టేషన్ల మీదుగా పలు వీక్లీ స్పెషల్ రైళ్లను నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాగ్‌రాజ్– బెంగళూరు– ప్రయాగ్ రాజ్ రైల్వేస్టేషన్ల మధ్య 04131/04132 నంబర్లతో అక్టోబర్ 13 నుంచి నవంబర్ 20వ తేదీ వరకు 12 వీక్లీ రైళ్లను రైల్వేశాఖ నడిపించనుంది. ప్రయాగ్ రాజ్ రైల్వేస్టేషన్‌లో ప్రతి ఆదివారం, బెంగళూర్‌లో ప్రతి బుధవారం ఈ ప్రత్యేక రైళ్లు బయల్దేరనున్నాయి.

మెడికల్ కళాశాల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రారంభానికి వైద్య కళాశాల సిద్ధం

నర్సంపేట, సెప్టెంబర్ 10: నర్సంపేటలో వైద్య కళాశాల ప్రారంభానికి సిద్ధమైందని కలెక్టర్ డాక్టర్ సత్యశారద తెలిపారు. మంగళవారం ఆమె మెడికల్ కళాశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలను పరిశీలించారు. ఫిర్యాదుల పెట్టెను తెరిచి ఫిర్యాదులు, డిజిటల్ బోర్డును పరిశీలించారు. ఆవరణలో వర్షపు నీరు నిల్వకుండా చూడాలన్నారు. ఆమె వెంట డీఆర్డీవో కౌసల్యాదేవి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, జడ్పీ సీఈవో రామిరెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి పుష్పలత ఉన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

గణేశ్‌నగర్‌లోని లోతట్టు ఇళ్లల్లోకి చేరిన నీళ్లు

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 10: వరంగల్ దేశాయిపేటలోని చిన్న వడ్డేపల్లి చెరువు నిండు కుండా మారింది. ఈ క్రమంలో చెరువు రెండు గేట్లను మూసివేయడంతో మంగళవారం వరద ప్రవాహం పెరిగింది. దీంతో గణేశ్‌నగర్, సమీప లోతట్టు ప్రాంతాల్లోని ఇండ్లలోకి నీరు చేరింది. నిత్యావసరాలు తడిసినట్లు బాధితులు వాపోయారు. వెంటనే బల్దియా అధికారులు స్పందించి నివారణ చర్యలు చేపట్టాలని కోరారు.

ఉద్యోగులను బెదిరిస్తూ వసూళ్ల పర్వం

- అవుట్ సోర్సింగ్ సిబ్బందిపై దాడులు
- ఇనుప గొలుసులతో కట్టేసి చిత్రహింసలు
- బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి..
- కిలేడిని అరెస్ట్ చేసిన పోలీసులు
- 10 వేల నగదు, ఇనుప గొలుసు, తాళం చెవిలు స్వాధీనం

రాజమ్మ అరెస్టు చూపుతున్న ఏసీపీ నందిరాంనాయక్, సీఐ గోపి

మట్టెవాడ, సెప్టెంబర్ 10: ఎంజీఎం దవాఖానలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న మహిళను మంగళవారం మట్టెవాడ పోలీసులు అరెస్టు చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మంగళవారం సీఐ టి.గోపి వెల్లడించారు. ఔట్ సోర్సింగ్ శానిటేషన్ వర్కర్‌గా పని చేస్తున్న బిళ్ల సుమలతపై అదే దవాఖానలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల లీడర్‌గా చెలామణి అవుతున్న ఆలకుంట రాజమ్మ దాడి చేసింది. ఈ నెల 9న సుమలత విధులకు హాజరై బయోమెట్రిక్ కోసం వెళ్తున్న క్రమంలో రాజమ్మ దాడి చేయగా, సుమలత సెల్‌ఫోన్ పగిలిపోయింది. అంతేకాకుండా ఇటీవల సుమలతకు ఆపరేషన్ కాగా కుట్లు దెబ్బతిన్నాయి. బాధితురాలిని కొట్టడంతోపాటు తన వెంట తెచ్చుకున్న ఇనుప గొలుసులతో కట్టివేసి సహించింది. ఎంజీఎం ఆస్పత్రిలో ఔట్ సోర్సింగ్ శానిటేషన్ ఉద్యోగాల కోసం తానే జీవో తీసుకొచ్చానని, రూ. 2 లక్షలు ఇవ్వకుండా ఎలా ఉద్యోగం చేస్తావో చూస్తానని, డబ్బులు ఇవ్వకుంటే చంపేస్తానని రాజమ్మ బెదిరించింది.

ఎంజీఎంహెచ్ కేంద్రంగా రాజమ్మ దందాలు

ఎంజీఎంహెచ్ కేంద్రంగా రాజమ్మ పలు దందాలు చేస్తున్నది. ఇతర అవుట్ సోర్సింగ్ విషయంలో కూడా సహ ఉద్యోగులను బెదిరిస్తూ తన వెంట తెచ్చుకున్న ఇనుప గొలుసులు, తాళం చెవిలను చూపిస్తూ భయపెట్టి డబ్బులు వసూలు చేసేది. గతంలో డాక్టర్లు, నర్సులు, సిబ్బందిపై రాజమ్మ దుర్భాషలాడింది. వారు రాజమ్మను తొలగించాలని కోరుతూ ఆసుపత్రి ఎదుట ధర్నా కూడా నిర్వహించారు. అయితే, రాజమ్మపై ఫిర్యాదులు అందకపోవడంతో పోలీసులు దృష్టి సారించలేదు. ఈ నేపథ్యంలో సోమవారం బిల్ల సుమలత ఫిర్యాదుతో రాజమ్మను అరెస్టు చేసి, ఆమె నుంచి రూ. 10 వేలు, ఇనుప గొలుసు, తాడు, తాళం చెవిలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు. ఎస్సై విటల్, సిబ్బంది ఉన్నారు.

విధుల్లో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం తగదు

- ఇంటింటా జ్వర సర్వే చేపట్టాలి
- డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

పోచమ్మమైదాన్: కాశీబుగ్గలో దోమల మందు పిచికారీని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 10: విధుల్లో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కాజీపేట వెంకటరమణ సూచించారు. కాశీబుగ్గలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రస్తుతం వర్షాలు విస్తృతంగా కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించి, వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కాశీబుగ్గ ఆరోగ్యకేంద్రం పరిధిలో నమోదైన డెంగ్యూ బాధితుల ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి సూచనలు చేశారు. వైద్య సిబ్బంది ఇంటింటా జ్వర సర్వే చేయాలని, వారి నుంచి రక్త నమూనాలు సేకరించి మందులు పంపిణీ చేయాలన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

చెన్నారావుపేట/దుగ్గొండి/నెక్కొండ/ఖానాపురం: ఇంటి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం వల్లే వ్యాధులు ప్రబలుతున్నాయని ఎన్వీబీడీసీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మోహన్ సింగ్ అన్నారు. చెన్నారావుపేట పీహెచ్‌సీ పరిధిలోని అక్కల్‌చెడలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ గోపాల్‌రావుతో కలిసి గృహ సందర్శన చేశారు. ఈ సందర్భంగా జ్వరపీడితులతో మాట్లాడారు. గ్రామాల్లో యువజన, మహిళా సంఘాలను సమన్వయం చేసుకొని శానిటేషన్ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్యులను కోరారు. ఖానాపురం మండలంలోని అశోక్‌నగర్, అయోధ్యనగర్, భద్రుతండాలో వైద్య శిబిరాలు నిర్వహించారు. డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదు అవుతున్నందున యాంటీ లార్వా ఆపరేషన్, మురుగునీటిలో టిమోపాస్ స్ప్రెయింగ్ చేయించినట్లు తెలిపారు. అదేవిధంగా నీరు నిల్వ ఉన్నచోట ఆయిల్‌బాల్స్ వేశామన్నారు. నెక్కొండ మండలంలోని అలంకానిపేట, అప్పల్‌రావుపేట, బంజరుపల్లిలో డెంగ్యూ కేసులు నమోదు కాగా, దోమల మందు పిచికారీ చేయించారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ మోహన్‌సింగ్, నర్సంపేట, వర్ధన్నపేట డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ ప్రకాశ్, డాక్టర్ గోపాల్‌రావు అప్పల్‌రావుపేట గ్రామాన్ని సందర్శించారు. డెంగ్యూ బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. దుగ్గొండి మండలంలోని వెంకటాపురంలో నర్సంపేట వైద్య కళాశాల ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో ఐ.ప్రకాశ్ శిబిరాన్ని పరిశీలించి ప్రజలకు సూచనలు చేశారు. ఈ శిబిరంలో 221 మందికి సాధారణ, 27 మందికి డెంగ్యూ, మలేరియా వైద్య పరీక్షలు నిర్వహించారు.

శ్రీనివాసాచార్యులుకు పురస్కారం

పురస్కారం అందుకుంటున్న శ్రీనివాసాచార్యులు

మట్టెవాడ, సెప్టెంబర్ 10: ఉపాధ్యాయుడు, సామాజిక సేవకుడు డాక్టర్ టి.శ్రీధరాచార్యులు గురుబ్రహ్మ జాతీయ పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లో జీసీఎస్ వల్లూరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో తెలంగాణలోని పలువురికి ఈ అవార్డులను నిర్వాహకులు అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు, సామాజిక సేవకుడు, వ్యాఖ్యాత అయిన శ్రీధరాచార్యులు సినీ నటుడు సుమన్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.

అనుమతుల్లేని ఫైర్‌వర్క్స్ షాప్ సీజ్

ఫైర్ సామగ్రిని పరిశీలిస్తున్న ఏసీపీ

గిర్మాజీపేట, సెప్టెంబర్ 10: అనుమతి లేకుండా ఫైర్ సామగ్రిని విక్రయిస్తున్న సాకరాజు కుంట వద్ద ఉన్న మంచాల లక్ష్మీప్రసన్న షాప్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు మంగళవారం ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. లైసెన్స్ లేకుండా రూ. 5 లక్షల ఫైర్ సామగ్రిని షాపులో భద్రపరిచారని, వాటిని సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

రైలు నుంచి పడి ఒకరి మృతి

గిర్మాజీపేట, సెప్టెంబర్ 10: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి ఒకరు మృతి చెందిన ఘటన వరంగల్ రైల్వే స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరుకు చెందిన షేక్ అల్లాబాగ్సా(33) బిలాస్పూర్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నాడు. మంగళవారం ఉదయం చింతల్‌స్టేషన్ వద్ద రైలు లోనుంచి జారిపడి మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలుసుకొని అతడి తల్లి బురాన్‌బీకి సమాచారం అందించారు. ఆమెను పిలిపించి శవపరీక్ష చేసి మృతదేహాన్ని అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED HOSPITAL STAFF

★Lab Technicians – Boys, Pharmacy Boys (మందుల షాపు) OT Boys కావలెను. సంప్ర : GUARDIAN HOSPITAL, Mulugu 'X' Road, Warangal. 12 to 2 PM.
NTW-0427

CHANGE OF NAME
I, RIYANA BEGUM (New Name) previously called MD RIYANA BEGUM (Old Name) and Residing at H.No 35-6-607, Amaravathi Nagar, Opp: Tulasi Bar, Hanamkonda, Hanumakonda District-506009, Telangana, India., and solembly declare.

CHANGE OF NAME
★ I, PREM CHANDU VELPULA (New Name) previously called VELPULA CHANDUSAI (Old Name) H.No. 7-1-360/48, Padmakshi Colony, Lakshmipuram Colony, Hanamkonda Manda, Hanumakonda Dist. - 506 001. T.S, and solemnly declare.
NTW-000

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం, జీతం 16 K to 18K, ఏజెంట్ కమిషన్ 6K Ph: 9640258899/9640468899.
NT-331762

CHANGE OF NAME
★ I, MOHAMMED SULEIMAN (Name) SALEEM (Surname) (New Name) S/o MOHAMMED SALEEMUDDIN Previously called MOHAMMED SULEIMAN SALEEM (Old Name) R/o H.No. 1-8-295/1, Masha Allah Manzil, Balasamudram, Hanamkonda, Hanumakonda Dist. -506 001. T.S, and solemnly declare.
NTW-000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం: 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

గీసుగొండ, సెప్టెంబర్ 10: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ కామారెడ్డి సభలో హామీ ఇచ్చిన బీసీ డిక్లరేషన్‌నే అమలు చేయాలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. మండలకేంద్రానికి చెందిన రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమారస్వామి తన నివాసంలో బీసీ రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ 17 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. ఆయన ఆరోగ్యం క్షీణించడంతో బీసీ నేతల పిలుపుతో బండా ప్రకాశ్ మంగళవారం నాయకులతో కలిసి గీసుగొండకు చేరుకొని కుమారస్వామితో మాట్లాడి, నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. కాంగ్రెస్ బీసీలను మోసం చేస్తున్నదని, భవిష్యత్‌లో రిలే దీక్షలు చేస్తామన్నారు.

చిన్న వడ్డేపల్లి చెరువును పరిశీలిస్తున్న డీసీపీ సలీమా

నిమజ్జన ప్రాంతాల పరిశీలన

పోచమ్మమైదాన్/కరీమాబాద్, సెప్టెంబర్ 10: వరంగల్ నగరంలోని పలు ప్రాంతాల్లో గణనాథులను నిమజ్జనం చేయనున్న చెరువులను పోలీసు అధికారులు మంగళవారం పరిశీలించారు. చిన్న వడ్డేపల్లి చెరువు, కోట చెరువు, ఉర్సు చెరువును సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా, ఏసీపీ నందిరాం నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై చర్చించారు. వారి వెంట సీఐలు తుమ్మ గోపి, మచ్చ శివకుమార్ ఉన్నారు. అలాగే, ఉర్సు చెరువులో గుర్రపుడెక్క తొలగింపు పనులను 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని బల్దియా అధికారులను కోరారు.

వడ్లకొండలో ఐదుగురిపై కేసు నమోదు

పర్వతగిరి, సెప్టెంబర్ 10: వడ్లకొండలో ఎర్రం మల్లయ్యకు చెందిన భూమిని అక్రమంగా ఇతరుల పేరున పట్టా చేసిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. గ్రామానికి చెందిన మల్లయ్య మరణించినట్లు డెత్ సర్టిఫికెట్ సృష్టించి అతడి 1.25 ఎకరాల భూమిని ఎర్రం దూడయ్యకు విరాసత్ ద్వారా ఏడాదిన్నర క్రితం పట్టా పుస్తకం జారీ చేశారు. దీంతో అప్పటి తహసీల్దార్ అజ్మీరా కోమీ, ఎర్రం దూడయ్య, వారికి సహకరించిన వెంకటేశ్వర్లు, రాజు, అప్సర్‌పాషాపై బాధితుడు మల్లయ్య ఫిర్యాదు చేశాడు. విచారణ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ ఎంపికలు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 10 : హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన వరంగల్ జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. అండర్–8, 10, 12, 14, 16, 18, 20 బాలబాలికల అథ్లెటిక్స్ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 50 పాఠశాలల నుంచి 700 మంది బాలబాలికలు పాల్గొన్నట్లు వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మూగల కుమార్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి యుగంధర్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కే సారంగపాణి ఎంపికలను ప్రారంభించారు. రాష్ట్రస్థాయి పోటీలకు 30 మంది ఎంపికయ్యారు. ఈ క్రీడాకారులు ఈ నెల 19, 20వ తేదీల్లో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వ్యాయామ దర్శకులు సాంబమూర్తి, రజనీకాంత్, వాసుదేవరావు, గంగిశెట్టి మనోజ్‌కుమార్, ఆవుల అశోక్, రంజిత్, కృష్ణమూర్తి, మహేందర్ పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుడికి విశేష పూజలు

కాశీబుగ్గలో సాయి గణేశ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడు

నర్సంపేట/నెక్కొండ/మట్టెవాడ/గీసుగొండ, సెప్టెంబర్ 10: గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వరుడు జిల్లావ్యాప్తంగా విశేష పూజలు అందుకుంటున్నాడు. మంగళవారం నర్సంపేటలో అన్నదానం చేశారు. పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో రుద్ర హోమం నిర్వహించారు. సిద్ధార్థ నగర్‌లో వినాయకుడికి ఏసీపీ కిరణ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. వరంగల్ కాశీబుగ్గలోని సిద్ధయ్య హోటల్ పక్క వీధిలో శ్రీసాయి గణేశ్ యూత్ ఆధ్వర్యంలో పదేళ్ల నుంచి మట్టి గణపతిని ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఏకదంతుడికి యువకులు పూజలు చేశారు. నెక్కొండలోని అంబేద్కర్ సెంటర్‌లో నవత యూత్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. వరంగల్ 29 డివిజన్‌లో శ్రీరఘునాథ్‌కాలనీలో శ్రీలక్ష్మీ గణపతి అసోసియేషన్ ఆధ్వర్యంలో లింగాల రాజేశ్, మౌనిక దంపతులు అన్నదానం చేశారు. బీఆర్‌ఎస్ 29 డివిజన్ అధ్యక్షుడు కొడకండ్ల సదాంత్, నాయకులు పాల్గొన్నారు. వరంగల్ 16వ డివిజన్ ధర్మారంలోని కోటమైసమ్మ తల్లి సంఘం ప్రధాన కార్యదర్శి పిట్టల రాజు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

మండపాలకు రూ. 4.50 లక్షల విరాళం

రాయపర్తి: మైలారం గ్రామానికి చెందిన శ్రీరాజరాజేశ్వరి (ఎస్‌ఆర్‌ఆర్) ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత, సామాజిక సేవా కార్యకర్త పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి మరోమారు ఔదార్యం చాటుకున్నారు. రాయపర్తి, మైలారం, పెర్కవేడు, గణేశ్‌కుంటతండా, రావులతండా, విద్యానగర్‌తండాలో తన సంస్థ ప్రతినిధులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన 32 గణేశ్ మండపాలకు రూ. 4.50 లక్షల విరాళాలు అందజేశారు.

చెరువులు ఇలా.. నిమజ్జనం ఎలా?

- ఏర్పాట్లు ప్రారంభించని బల్దియా
- సమీక్షతోనే సరిపెట్టిన మేయర్, బల్దియా కమిషనర్


చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క

వరంగల్, సెప్టెంబర్ 10: మరో ఐదు రోజుల్లో గణేశ్ నిమజ్జనం జరుగనున్నప్పటికీ బల్దియా ఏర్పాట్లు మొదలు పెట్టలేదు. గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలో సుమారు 5 వేలకు పైగా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు అంచనా. ఈ విగ్రహాలను 24 చెరువుల్లో నిమజ్జనం చేయనున్నారు. వారం క్రితం మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సమీక్షించి నిమజ్జనానికి చెరువుల వద్ద విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు అధికారులు చెరువుల వద్ద ఏర్పాట్లు ప్రారంభించలేదు. గ్రేటర్ పరిధిలో నిమజ్జనం చేసే చెరువులు గుర్రపు డెక్కతో నిండి ఉన్నాయి. పెద్ద వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసే చిన్నవడ్డేపల్లి, కోమటి చెరువు, ఉర్సు చెరువు, కట్ట మల్లన్న, బెస్తం చెరువులతోపాటు బంధం, హసన్‌పర్తి పెద్ద చెరువుల వద్ద ఇప్పటి వరకు పనులు చేపట్టకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. దీనికితోడు చెరువుల వద్దకు వెళ్లే రహదారులు గంతలు పడి ఎగుడుదిగుడుగా ఉన్నాయి. మరో ఐదు రోజుల్లో నిమజ్జన కార్యక్రమం ఉన్న నేపథ్యంలో పనులు ప్రారంభించక పోవడంపై నగర వాసుల నుంచి విమర్శలు వస్తున్నాయి. గ్రేటర్ అధికారుల తీరు మారడం లేదని మండిపడుతున్నారు.

వరంగల్‌లో పొగాకు ఉత్పత్తుల పట్టివేత

గిర్మాజీపేట, సెప్టెంబర్ 10: గుట్కా, అంబర్ ప్యాకెట్లను పట్టుకొని సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఇంతెజార్‌గంజ్ పోలీసులతో కలిసి మంగళవారం జయబాలాజీ కిరాణా షాపులో తనిఖీలు నిర్వహించారు. యజమాని భీమండి హరితేజ వద్ద రూ. 10,250 విలువైన అంబర్, గుట్కా ప్యాకెట్లు, అలాగే, హరితేజ వద్ద సేల్స్‌మెన్‌గా పని చేస్తున్న వ్యామసాని కృష్ణ దగ్గర రూ. 5,050 విలువైన పొగాకు ఉత్పత్తులను పట్టుకొని సీజ్ చేశారు. ఇద్దరు నిందితులను ఇంతెజార్‌గంజ్ పోలీసులకు అప్పగించామని ఏసీపీ తెలిపారు. మత్తు పదార్థాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాతీయ సైన్స్ పోటీలకు హైడ్రో బైస్కిల్

విద్యార్థులు వర్షిక్, అభిరామ్, గైడ్ టీచర్

సంగెం, సెప్టెంబర్ 10: గవిచర్ల మోడల్ స్కూల్ విద్యార్థులు చేపట్టిన ప్రాజెక్టు జాతీయ స్థాయి సైన్స్ పోటీలకు ఎంపికైంది. 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు వర్షిత్, అభిరామ్ గైడ్ టీచర్ ఆర్.రాజప్రభ ఆధ్వర్యంలో హైడ్రో బైస్కిల్‌ను తయారు చేశారు. రాష్ట్రస్థాయిలో బహుమతి పొంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. బెంగళూరులోని కేటీపీవో ట్రేడ్ సెంటర్‌లో సోమవారం ప్రదర్శించిన హైడ్రోబైస్కిల్ అందరినీ ఆకట్టుకుంది. ఈ ప్రాజెక్ట్ కర్ణాటక విద్యాశాఖ మంత్రి ప్రశంసలు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ ముజుబుర్‌రహమాన్ తెలిపారు.

25 కిలోల లడ్డూ అందజేత

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 10: వరంగల్ కాశీబుగ్గలో వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి సీఎంఆర్ షాపింగ్‌మాల్ స్టోర్ మేనేజర్ వెంకటరమణ 25 కిలోల లడ్డూను మంగళవారం రాత్రి బహూకరించారు. అనంతరం 60 కిలోల పులిహోరను భక్తులకు పంపిణీ చేశారు. అలాగే, 14వ డివిజన్ మణికంఠ కాలనీలోని శ్రీమహాగణపతి మండపం వద్ద వినాయకుడికి కాలనీ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పంచామృతాలు, పండ్లు, పూలతో అభిషేకం చేశారు.


వరంగల్ : బాలసముద్రంలోని సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో స్వచ్ఛ ఆటోలు మంగళవారం బారులుతీరాయి. గంటల తరబడి చెత్త డంపింగ్ కోసం వేచి ఉండాల్సి వచ్చిందని డ్రైవర్లు తెలిపారు.